# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-04-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. సార్వత్రిక ఎన్నికలపై సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతోన్న అసత్య వార్తల పట్ల ప్రజలు జాగరూకతతో ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పేర్కొన్నారు.**

**2. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర తిరుపతి జిల్లాలో కొనసాగుతోంది.**

**3. రాష్ట్రవ్యాప్తంగా డా.బీఆర్.అంబేద్కర్ గురుకులాల్లో ఇంటర్ ప్రవేశ పరీక్షా ఫలితాలను రాష్ట్ర సాంఘిక, సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్.మహేష్ కుమార్ విడుదల చేశారు.**

**4. రాష్ట్రంలో పెరుగుతున్న ఎండ తీవ్రత, వడగాడ్పుల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సూచించింది.**

**5. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రెండో విడత నామినేషన్ల ప్రక్రియ ఈరోజుతో ముగియనుంది.**

==========================

ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోకపోతే బ్యాంక్ ఖాతాల నుంచి కేంద్ర ప్రభుత్వ 350రూపాయలు మినహాయించుకుంటుందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఖండించారు. ఓటు హక్కు వినియోగించుకోని వారిని గుర్తించి వారి ఆధార్ నంబర్ ఆధారంగా వారి ఖాతాల నుంచి 350రూపాయలు మినహించడానికి న్యాయస్థానాలు కూడా అనుమతించినట్లు చేస్తోన్న ప్రచారం నిజం కాదని అవాస్తవమని సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతోన్న ఇటువంటి అసత్య ప్రకటనల పట్ల ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రచారం అవుతున్న వార్తల్లో వాస్తవాలు తెలుసుకోవడానికి మిత్ వర్సెస్ రియాలిటీ డాట్ ఈ.సీ.ఐ డాట్ జీ.వో.వీ.డాట్ ఇన్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు.

--------------------------

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర తిరుపతి జిల్లాలో కొనసాగుతోంది. గురవరాజుపల్లె ప్రాంతం నుంచి ఈరోజు బయలుదేరి మల్లవరం మీదుగా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు, మిట్టకండ్రిగ, పొయ్య గ్రామం మీదుగా సాగింది. పొయ్యగ్రామంలో ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందించాలన్న

లక్ష్యంతో ప్రభుత్వం పని చేసిందని అన్నారు. ఈ బస్సు యాత్ర తరువాత నగల్లు, శ్రీకాళహస్తి బైపాస్ మీదుగా చిన్న సింగమల సమీపానికి చేరుకుంటుంది. అక్కడ లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లతో ముఖాముఖిలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం నాయుడుపేట సమీపంలోని చెన్నై జాతీయ రహదారి పక్కన జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.

---------------------------

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రెండో విడత నామినేషన్ల ప్రక్రియ ఈరోజుతో ముగుస్తుంది. ఈ దశలో 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 88 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. కేరళలో 20, కర్ణాటకలో 14లు, రాజస్థాన్‌లో 13, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల్లో చెరో ఎనిమిదేసి చొప్పున, మధ్యప్రదేశ్‌లో 7, అస్సోం, బీహార్ రాష్ట్రాల్లో చేరో ఐదు, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్‌లో చేరో మూడు స్థానాలకు, మణిపూర్, త్రిపుర, జమ్మూ కాశ్మీర్‌లలో ఒక్కో స్థానానికి రెండో దశలో ఎన్నికలు జరగనున్నాయి. రేపు ఎన్నికల నామినేషన్ల పరిశీలన, ఏప్రిల్ 26న పోలింగ్ జరగనుంది.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ గురుకుల పాఠశాలకు సంబంధించిన ఇంటర్ ప్రవేశ పరీక్షా ఫలితాలను రాష్ట్ర సాంఘిక, సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి డాక్టర్ ఆర్.మహేష్‌కుమార్ నిన్న విడుదల చేశారు. తాడేపల్లిలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా 40,853 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, పరీక్షకు 35,629 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. అంబేద్కర్ గురుకులాల్లో బాలికలకు 9,280 సీట్లు, బాలురకు 4,280 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతిభ ఆధారంగా ఆయా విభాగాల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. ఇ ంటర్ ప్రవేశ పరీక్ష ఫలితాల కోసం ఖజూఎత్తీఖ్రష్వ్.ఖజూఎటం౦.ఱఅ ను వీక్షించాలని సూచించారు.

---------------------------

రాజ్య సభకు ఇటీవల ఎన్నికైన సభ్యులతో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్కడ్ ఈ రోజు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యులుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబురావు,మేడా రఘునాథ్ రెడ్డిలు ప్రమాణ స్వీకారం చేశారు.అలాగే తెలంగాణ నుంచి భారతీయ రాష్ట్ర సమితికి చెందిన వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

---------------------------

రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత, వడగాడ్పుల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సూచించింది. బాలింతలు, చిన్నారులు, వృద్ధులు ఎండ ఎక్కువ ఉంటే బయటకు వెళ్లారాదని సూచించింది. ఎవరైనా బయటకు వెళ్లాల్సి వస్తే తలపై ఆచ్ఛాదనగా వస్త్రాలు ధరించాలని పేర్కొంది. బయటకు వెళ్ళి వచ్చిన వెంటనే నీరు, నిమ్మరసం,కొబ్బరి నీళ్లు, మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్‌ఎస్ వంటి పానీయాలను తీసుకోవాలని తెలిపింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల మధ్య ఎండలో శారీరక శ్రమను పెంచే పనులు చేయొద్దని సూచించింది. తల తిరగడం, వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలు ఎదురయితే వడదెబ్బగా గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించాలని స్పష్టం చేసింది.

---------------------------

సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు పారదర్శకంగా, సమర్థవంతంగా పని చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు తెలిపారు. నిన్న పుట్టపర్తిలో ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి ఎన్నికల అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పోలింగ్ స్టేషన్ ల్లో చేపట్టవలసిన పనులు, ఈవీఎం యంత్రాల పనితీరు పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుండి ముగిసే వరకు ఎన్నికల విధులను నిర్వర్తించే ప్రతి ఒక్కరూ అంకితభావంతో తమకు అప్పగించిన పనులు పూర్తి చేయాలని సూచించారు.

---------------------------

ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవహగాన కల్పించేలా ప్రకాశం జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో స్వీప్ కార్యక్రమాలను నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ తెలిపారు. నల్లమల అభయారణ్యంలోని యర్రగొండపాలెం నియోజకవర్గ అటవీ ప్రాంతంలో ఉన్న పాలుట్ల గ్రామంలో నిన్న ఓటర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాలుట్ల గ్రామంలో కలెక్టర్ జిల్లా అధికారులు గిరిపుత్రులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో ఉన్న పాలుట్ల పోలింగ్ కేంద్రంలో 960 మంది ఓటర్లు ఉన్నారని, గత ఎన్నికల్లో ఇక్కడ 70 శాతం పోలింగ్ నమోదైందన్నారు. పోలింగ్ శాతం పెంచే క్రమంలో మారుమూలగిరిజన గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.

---------------------------

రాష్ట్ర హైకోర్టు సూచనలు మేరకు మే 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ్ కుమార్ తెలిపారు. ఈ రోజు చిత్తూరుజిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ.. కక్షి దారులు మధ్య వర్తిత్వం ద్వారా వివాదాలను సున్నితంగా పరిష్కారించుకోవడమే జాతీయ లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశం అన్నారు. సత్వర న్యాయం కోసం కక్షి దారులకు లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలని సూచించారు.

---------------------------

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తర గతులను సద్వినియోగం చేసుకోవాలని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి కోరారు. విజయవాడ, గుంటూరులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సహా, పలు ఉచిత కోచింగ్ కేంద్రాలను ఆమె నిన్న దర్శించి విద్యార్థులకు స్టడీ మెటీ రియల్స్ పంపిణీ చేశారు. అనంతరం నాగరాణి మాట్లాడుతూ పాలిటెక్నిక్ ప్రవేశాల పెంపు లక్ష్యంగా విద్యార్థులకు ఇస్తున్న సమగ్ర శిక్షణకు మంచి స్పం దన లభిస్తోందన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమ విద్యార్థులకు ఉపకరించేలా రెండు భాషల్లోనూ స్టడీ మెటీరియల్ సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలోని 87 ప్రభుత్వ, 182 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏప్రిల్ 24 వరకు తరగతులు నిర్వహించి ఏప్రిల్ 25వ తేదీన ప్రీ ఫైనల్ ప్రవేశ పరిక్ష నిర్వహిస్తామన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27వ తేదీ కాగా, ఆన్ లైన్ అప్లికేషన్లకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందని స్పష్టం చేశారు.

====================